నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
II | హైదరాబాద్, ఆదివారం 27 ఏప్రిల్ 2025 | HYDERABAD


బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో 'చలో వరంగల్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి


చిలుకానగర్‌లో రజతోత్సవ సభకు హాజరు కావాలని ప్రజలను కోరుతున్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

సమరోత్సాహం

## గులాబీ జెండా ఎత్తి..
# ఓరుగల్లు బాట పట్టి


అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో బీఆర్ఎస్ రజతోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్




రజతోత్సవ సంబురం



**నగరం** గులాబీ మయమైంది.. నలుదిక్కులూ.. జై బీఆర్ఎస్.. జైజై కేసీఆర్ నినాదాలతో ప్రతిధ్వనిస్తున్నాయి.. బీఆర్ఎస్ 25 వసంతాల వేడుక..తమ ఇంటి పండుగగా భావిస్తూ.. భాగ్యనగరవాసులు. పోరాటాల గడ్డ ఓరుగల్లు బాటపడుతున్నారు. ఒకవైపు ఎండలు మండుతున్నా.. గుండెల నిండా కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో ఆదివారం ఎల్కతుర్తి వేదికగా జరిగే రజతోత్సవ సభకు బయలెల్లుతున్నారు. తెలంగాణ పాటల ధూందాంతో.. బస్సులు, బైక్‌ల ర్యాలీ తీసుకుంటూ.. గులాబీ శ్రేణులు వరంగల్ చేరుకుంటున్నాయి. గ్రేటర్ నుంచి భారీ సంఖ్యలో సభా ప్రాంగణానికి చేరుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో సిటీలోని ప్రధాన రహదారులన్నీ 'గులాబీ' వర్ణంతో కళకళలాడుతున్నాయి. -సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)

## గులాబీ వర్ణమైన గ్రేటర్

### రజతోత్సవ సభకు కదిలిన నగరం

### నేడు ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సభ

### సోషల్ మీడియాలోనూ.. కేసీఆర్, గులాబీ జెండాల చిత్రపటాలే

గ్రేటర్‌లో అన్నీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నాయకులు శనివారం బీఆర్ఎస్ జెండాలు ఎగురవేసి పండుగ చేశారు. కార్యకర్తలు, ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఓరుగల్లు సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులంతా కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సంబంధిత నియోజకవర్గాల నాయకులు ప్రధాన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లతో నగరాన్ని గులాబీమయం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా కార్యకర్తల సమక్షంలో కేకులు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ పాటలు ఆలపిస్తూ సందడి చేశారు.


సరూర్‌నగర్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో భారీ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

### ఫొటోలు దిగి..పోస్ట్ చేసి..

కేసీఆర్, గులాబీ జెండాల చిత్రపటాలతో సోషల్ మీడియా నిండిపోయింది. బీఆర్ఎస్ 25 ఏండ్ల జెండా పండుగకు తరలివెళ్తున్నామంటూ.. ఫొటోలు దిగి ఇన్‌స్టా, ఎక్స్, వాట్సాప్ స్టేటస్, ఫేస్‌బుక్‌ల్లో అప్‌లోడ్ చేసి నెటిజన్లు తమ అభిమానాన్ని చాటుకున్నారు. 'జై కేసీఆర్' అంటూ అప్పటి ఉమ్మడి పాలనను యాద్‌జేసుకొని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటూ పోస్టులు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఒరిగిందేమీలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఎల్కతుర్తికి రవాణా కార్మికులు..

గ్రేటర్‌కు చెందిన రవాణా రంగ కార్మికులు ఎల్కతుర్తి సభకు పయనమయ్యారు. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు వారి వారి వాహనాల్లో తరలివెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటగా నష్టపోయింది తామేనని ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను ఈ రాష్ట్రం నుంచి తరిమి మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని చెప్పారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో ఆటో కార్మికులు గులాబీ జెండాలను రెపరెపలాడిస్తూ సభకు తరలివెళ్లారు.

## బీఆర్ఎస్ ఫ్లెక్సీలను
# చించేసిన కాంగ్రెస్

### అయినా కేసీఆర్‌పై చెరగని అభిమానం


కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ ఫ్లెక్సీని చించేసిన దృశ్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఓరుగల్లు సభ సూపర్ సక్సెస్ కాబోతున్నదనే సంకేతాన్ని గ్రేటర్ గులాబీ దండు తమ సన్నాహక కార్యక్రమాలతో చాటడంతో.. జీర్ణించుకోలేని రేవంత్ సర్కార్ కుటిల రాజకీయాలకు తెర తీసింది. గ్రేటర్ అంతా పరుచుకున్న గులాబీ పోస్టర్లు, ఫ్లెక్సీలను చించివేస్తూ రాక్షసానందం పొందింది. కనిపించిన ప్రతీ బీఆర్ఎస్ పోస్టర్‌ను హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది అర్ధరాత్రుల్లో ప్రత్యేకంగా విధులు నిర్వర్తించి మరీ చించేశారు. ప్రకృతి విపత్తు, వరదలు తదితర అత్యవసర సమయంలో రంగంలోకి దిగాల్సిన డీఆర్ఎఫ్ బృందాలు సైతం అర్ధరాత్రి విధులు నిర్వర్తించి గులాబీ పార్టీ పోస్టర్లను చించివేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. పోస్టర్లు చించొద్దంటూ గులాబీ కార్యకర్తలు వేడుకున్నా వినిపించుకోకుండా బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. కాంగ్రెస్ పోస్టర్లు ఎందుకు చించడం లేదంటూ నిలదీసిన ప్రజలను ఇష్టానుసారంగా తిడుతూ ఫోన్లు గుంజుకొని బెదిరించారు. పోస్టర్లను చించి వాటిని హైడ్రా సిబ్బంది తమ వాహనంలో తరలించేయత్నం చేశారు. ఈ మార్గంలో హైడ్రా వాహనం అతివేగంతో మరో వాహనాన్ని ఢీకొట్టింది. హైడ్రా వాహనం ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. దీంతో సదరు వాహనం వ్యక్తులు హైడ్రా సిబ్బందిని నిలదీశారు. అక్కడికి వచ్చిన పోలీసులు ఆరా తీయగా.. వారి సమాధానం చెప్పకుండానే 'హైడ్రా' వాహనం వెళ్లిపోతుంది.. ట్రాఫిక్ క్లియర్ చేయండి'' అంటూ సిబ్బంది ఇన్‌స్పెక్టర్ అధికారికి చెప్పడం విస్మయానికి గురిచేసింది. కాగా, గోడలపై పోస్టర్లు చించేయగలరేమో.. కానీ గుండెల్లో కేసీఆర్‌పై అభిమానాన్ని చెరపలేరంటూ నెటిజన్లు ఫైర్ అయ్యారు. ప్రజాస్వామ్యంలో ఫ్లెక్సీ పెట్టుకునే స్వేచ్ఛ లేకపోవడం బాధాకరం. తెలంగాణ ప్రజల గుండెల్లో చెదరని సంతకమే కేసీఆర్ అంటూ..సాయిరామ్ అనే నెటిజన్ తన అభిప్రాయం పంచుకున్నాడు. బీఆర్ఎస్ సభ పేరు వింటేనే కాంగ్రెస్ సర్కార్‌లో వణుకు పుడుతోందని మరో నెటిజన్ ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.




